# ఇలాచేస్తే?



## శ్రీమతి సెంటీనా సరోజిని

ఆ రోజు ఆదివారం. సాయంకాల సమయం... చల్లని నీళ్ళు చిలకరించిన లాన్‌లోవేసిన కుర్చీలో అలా నడుం వాల్చి ఆకాశంలో అందంగా కదలాడుతున్న మబ్బు తునకల్ని, గూళ్ళు చేరటానికి తొందర పడుతున్న పక్షి సంతానాన్ని చూస్తూ హాయిని అనుభవిస్తున్న సమయంలో... పానకం పుడకలా వూడిపడ్డాడు అప్పారావు. "నమస్కారం సార్" అంటూ క్రింద నతికిల పడనే పడ్డాడు.... ముఖానికి నవ్వుపులుముకొనిఆహ్వానించక తప్పలేదు. "ఏమిటోయ్, విశేషాలు? చావాళ్ళకొచ్చావు?" పలుకరించారు. దానికే ఎదురుచూస్తున్నట్లు, ఒక్కసారిగా, తన సొదమొదలు పెట్టాడు...

"ఏమిటోసార్... నాకు, రోజురోజుకూ, పిచ్చెత్తి పోతూంది ఈ మనుషుల వాలకం చూస్తుంటే... అసలు వీళ్ళకు పిచ్చో, నాకే పిచ్చో..."

"ఏమయిందోయ్... అసలు సంగతి చెప్పు..."

"మొన్న మా పిల్లల్ని స్కూల్లో చేరిపిద్దామని వెళ్ళాను సార్..."

"వెళ్తే? డొనేషనడిగారా? సీటు లేదన్నారా?"

"అబ్బే... అదికాదు సార్... సీట్లు వున్నాయట... డొనేషనూ కట్టటానికి సిద్ధమే అన్నాను..."

"మరి...?!"

"మా పెద్దపాపకు నాలుగో క్లాసులో, చిన్న పాపకు ఆరోక్లాసులో అయితే సీటిస్తామంటూరు సార్..."

"అదేంటోయ్...? మీ పెద్దపాప ఆరు పాసయిందిగా? చిన్నపాప రెండు పాసయిందను కొంటాను?"

"రైటేసార్... ముందు చదివిన స్కూల్‌లో ఇచ్చిన సర్టిఫికేట్లు ప్రోగ్రెసు కార్డులు తీసికెళ్ళాను. పైగా వాళ్ళు పరీక్ష పెట్టారు. ఇద్దరూ చక్కగా వ్రాశారు అన్నారు.... అయినా..."

"పెద్దమ్మాయిని నాలుగులో, చిన్నమ్మాయిని, ఆరులో చేర్చమంటూరు..?"

"..." తలగోక్కున్నాడు నదురు చిట్లిస్తూ.

"ఇదేమిటోయ్... చాలా వింతగా వుందే... ఆ...?!"

"...."

"కారణం, ఏమిటని అడగక పోయావూ?"

భగ్గుమన్నాడు అప్పారావు..."అయ్యో! రాత... వాళ్ళు మాట్లాడుతున్నారా సార్...! కొట్టినంత పనిచేశారు... ఇష్టంవుంటే చెప్పినట్లు చేర్పించు.. లేకుంటే,, బైటకు నడువు... అన్నారు. సార్... అసలు, వెళ్ళిన వాళ్ళు, వాళ్ళ కళ్ళకి, ఎలా కనిపిస్తున్నారో, సార్... చీమల్లాగానో... దోమల్లాగానో..."

"మరో స్కూలేదన్నా ప్రయత్నించక పోయావా..?"

"అదీ అయిందిసార్... వీళ్ళకు రెండో క్లాసులో మాత్రమే ఖాళీ వుందట సార్... అందుకని... ఎవ రొచ్చినా, రెండో క్లాసులోనే చేరాలట..."

"..."

"అదీచేశాను సార్..."

"అరే...! ఇద్దరినీ, రెండో క్లాసులో..."

"అవున్సార్... ఏదో చదువుకొంటారు... ముందు స్కూలుకంటే బడి జీతం తక్కువ... కాని..."

"ఆ... కానీ...?"

"యూనీఫారం కుట్టించాలి సార్..."

"ఎంతవు తుందంటావ్?" పర్సు తీయబోయాను...

"అబ్బెబ్బె... డబ్బొద్దుసార్.. ఏదో కాస్తవుంది సార్ తమదయవల్ల...?"

"మరి?!"

"యూనిఫారంకు, లేతనీలం బట్ట, కావాలట సార్... మొన్న షాపు కెళ్ళి అడిగితే... వాడు, ఆ కలర్ బట్ట అమ్మనంటున్నాడు..."

"ఏం? ఎందుకనీ...?!"

"ఆకు పచ్చబట్ట అమ్ముతాను. నీలం అమ్మనంటాడు..."

"అదే... ఎందుకని..?"

"ఏమోసార్... నా ఇష్టం... నా షాపు... నేనేది అమ్ముతానో అది, నా ఇష్టం... తీసుకొంటే తీసుకో లేకుంటే..."

"అదేం? వాడికి, పిచ్చా ఏం?"

"ఖరీదు మీద మరో రెండు, మూడు రూపాయలు ఎక్కువిస్తా నన్నాను సార్." అమ్మను పొమ్మన్నాడు. ఆ కలర్, మరో షాపులోనూ, దొరకలేదుసార్.." అప్పారావు, ముక్కు ఎగపీల్చి, కళ్ళు అద్దుకున్నాడు.

"అరెరే... అదేమిటోయ్... దానికేనా, కళ్ళనీళ్ళు, నేను మా జవాన్ను పంపి, ఆ బట్ట తెప్పిస్తానుండు..."

మరోమారు కళ్ళద్దుకొన్నాడు అప్పారావు... "అబ్బే... దానికి కాదుసార్...! ఇంట్లో, మా ఆడవాళ్ళకు, నాలుగు రోజులుగా జ్వరం సార్..."

"అరరే... డాక్టరుకు చూపించి, మందిప్పించ లేదటయ్యా?"

"చూపించాను సార్... ఆయన కడుపు నొప్పి మాత్రలేవో ఇచ్చారు సార్..."

"జ్వరానికి కడుపు నొప్పిమాత్రలా...?!"

అవున్సార్... అడిగితే... నీవు నాకు చెప్పేటంతటి వాడినా? గెటవుట్... అని కేకలు..."

"ఎవరో పిచ్చోడిలా వున్నాడే...! పోనీ మరో డాక్టరు..." తీసికెళ్ళానుసార్... ఆయన ఆప్రేషన్ చేయాలంటున్నాడు."

"ఆపరేషనా?!"

"అవున్సార్... అదీ, కాలు ఆప్రేషనట, సార్..."

"...."

'సరే అని... డబ్బుకట్టాను సార్... కొన్ని మందులు రాసిచ్చి తీసుకు రమ్మన్నారు సార్... మెడికల్ షాపు లో వాడు, ఆ మందులివ్వనంటాడు... ఆయన రాసిన మందులే నేనెందుకియ్యాల...? నా దగ్గర చెవినొప్పి, గొంతు నొప్పి మందులున్నాయి అవి తీసుకెళ్ళు, అంటూండాడు సార్... ఆమెకు జ్వరం తగ్గలా... అదట్ల వుందా? కాసిన్ని పాలల్లో, అంత నాన్ రొట్టె అద్ది, పెడదామన్నా దిక్కులేదు..." బోరు బోరున ఏడ్చాడు అప్పారావు.

"అరెరే.... ఏమిటోయ్... మరీ అంత..."

"ఏం చెయ్యను సార్...? రొట్టె రెండు రూపాయలేకదా? మరో రెండు ఇస్తానన్నా రొట్టె ఇవ్వను, బిస్కెట్లు ఇస్తానంటాడు, ఆ షాయిబు...

"ఆ...?!"

భగ్గుమన్నాడు అప్పారావు... 'అయ్యో! రాత... వాళ్ళు మాట్లాడుతున్నారా సార్...! కొట్టినంత పనిచేశారు... ఇష్టంవుంటే చెప్పినట్లు చేర్పించు... లేకుంటే, బైటకు నడువు... అన్నారు. సార్... రెండో క్లాసులోనే చేరాలట...

"బిస్కెట్లు అన్నీ, అమ్ముడయేదాకా, రొట్టె, అమ్మనంటాడు..."

"...."

"పోనీ, మా వాడిని పంపి... మరో దగ్గరయినా మందులు, రొట్టె తెప్పిద్దామంటే, వాడు ఇల్లు చేరేసరికి రాత్రి పదిగంటలవుద్ది. నేనా? ఆమెను... వదలి కదలలేను'... ఏడుస్తుంది..."


"మీ వాడు పదిగంటలకు రావటం ఏమిటే? ఏ కాలేజీ? మరీ అంత దూరమా?"

"వెస్లీ బోయిస్ కాలేజీ సార్—!, కాని బస్‌పాస్ అట్ల వుంది సార్..."

"ఎట్లోయ్...?"

"స్టేషన్ నుండి చార్‌మినార్ బోయే, బస్ ఎక్కాలసార్... నాంపల్లిలో దిగి... మళ్ళీ ట్యాంకుబాండ్ మీదగొచ్చి, ప్యారడైజు దగ్గర దిగుతాడు.... ఇప్పుడు స్టూడెంటు పాసులు ఇట్లనే, ఇస్తున్నారు సార్..."

"అరే... ఆశ్చర్యంగా వుందే....?!"



అవున్సార్... మనం, పోవాలన్న స్థలంకు బస్ తీసికెళ్ళదు.

అది తీసికెళ్ళిన చోటికి మనం వెళ్ళాల... ఆగినప్పుడు దిగాల... టిక్కెట్టుకు మనకి చిల్లరివ్వాల, అని బస్‌లో రాసుంటుంది. కాని కండక్టరు మనకివ్వాల్సిన చిల్లర పైసల విషయం... ఏమీ గుర్తుండదు... అంతా, వన్‌వే ట్రాఫిక్..."

"సరే... సరే... నీవు చెప్పేది చాలా ఆశ్చర్యంగా వుందోయ్ వాళ్ళకు ఖాళీ వున్న క్లాసుల్లోనే పిల్లలను చేర్చుకునటం, జ్వరమంటే... ఆపరేషనని ఒకరంటే... కడుపు నొప్పికి మాత్రలిచ్చింది మరొకరైతే... మన దగ్గరున్న మందులే కొనాలని షాపువాడు... బిస్కెట్లు అమ్ముడయే వరకూ రొట్టె అమ్మననటం... అంతా ఏదో వింతగా వుందే...?! వీళ్ళకు పిచ్చా...? మరేదన్నానా?!"

"వాళ్ళకు పిచ్చికాదు... మరేదీ కాదు.... అర్థం కాకపోవటానికి, ఇదేం, పెద్ద ఆల్జీబ్రా లెక్కేమిటండీ...? అప్పారావు ఆటో డ్రైవరన్న విషయం, వాళ్ళు గుర్తించి వుంటారు అందుకే...." శ్రీమతి అందుకొంది.

"టిప్‌ఫర్, టాప్... వేశారు..." కిలకిలలాడుతూ, నవ్వుల్లు పరిచారు పిల్లలు.

నాకు, జ్ఞానోదయమయింది. మరి అప్పారావుకో?

*